ఒక్కో పంచాయతీకి 20 చొప్పున ఉద్యోగాలు

- విద్యార్హతల వివరాలతో సంప్రదిస్తే యువకులకు ఉద్యోగాలు కల్పిస్తా
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



చిప్పాడ పంచాయతీ కంచేరుపాలెంలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

తగరపువలస: భీమిలి మండలం దివీస్ లేబొరేటరీ పరిధిలో ఉన్న అయిదు పంచాయతీల్లో 20 మంది యువకుల వంతున వంద మందికి ఉద్యోగాలు కల్పించినట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ కంచేరుపాలెం, ఆశిపాలెం, కొనసవానిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు దివీస్‌లో ఉద్యోగావకాశాలు కల్పించలేదంటూ ఆయన దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని... తాను ఎమ్మెల్యే అయిన తర్వాత దివీస్ యాజమాన్యంతో ఆరుసార్లు మాట్లాడి పంచాయతీకి 20 చొప్పున ఉద్యోగాలు వచ్చేలా కృషి చేశానన్నారు. గ్రామాల్లోని యువకులు ఎంత వరకు చదువుకున్నారో వివరాలతో సంప్రదిస్తే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కిడ్నీ బాధితులకు ప్రభుత్వం నెలకు రూ.10వేలు వంతున పింఛన్ అందిస్తుందన్నారు. రికమండేషన్, అవినీతి, లంచాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇప్పటికీ ఓట్లు లేని వారిని సచివాలయ సిబ్బంది గుర్తించి కొత్తగా దరఖాస్తు చేయించాలన్నారు. కంచేరుపాలెం ప్రజల తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా వారం రోజుల్లో దివీస్‌చే ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించాలని సర్పంచ్ వెంపాడ రమావతికి సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు భేష్

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి బాగుందని లబ్ధిదారులు కొనియాడారు. ఈ నాలుగున్నరేళ్లలో కంచేరుపాలెంలో ముడసల ఆదమ్మకు రూ.6.32 లక్షలు, పంచదార్ల సన్యాసమ్మకు రూ.6.35 లక్షలు, కోల రాజుకు రూ.4.53 లక్షలు, పంచదార్ల అప్పయ్యమ్మకు రూ.4.72 లక్షలు, ఎం.అప్పయ్యమ్మకు రూ.5.69 లక్షలు, నమ్మి సూర్యచంద్రకు రూ.4.94 లక్షలు, గుడ్డాల అచ్చియ్యమ్మకు రూ.4.79 లక్షలు, ఉప్పిలి నరసయ్యమ్మకు రూ.5.55 లక్షలు ప్రభుత్వం నుంచి అందాయని హర్షం వ్యక్తం చేశారు. 2024లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సరగడ రఘునాథరెడ్డి, వెంపాడ సూరిబాబు, సరగడ రాంబాబు, గాడు శ్రీను, జీవీ నారాయణ, చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, ఉండబట్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పూసాజెల్‌తో మెట్ట పంటలకు ఊపిరి



లక్ష్మీపురంలో రైతులకు పూసాజెల్ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు

తగరపువలస: మెట్ట పంటలైన వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు, పత్తి తదితర సాగులో పూసాజెల్ (రెయిన్ సాల్ట్) వినియోగించి రైతులు వర్షాభావం నుంచి ఉపశమనం పొందవచ్చని వ్యవసాయశాఖ జిల్లా శిక్షణ కేంద్రం సంచాలకుడు చదువుల సుబ్రహ్మణ్యం తెలిపారు. భీమిలి మండలం మజ్జివలస రైతు భరోసా కేంద్రం పరిధిలోని లక్ష్మీపురంలో రైతులకు పూసాజెల్ వినియోగంపై బుధవారం అవగాహన కలిగించారు. దీనిని రైతులు మెట్ట పంటలలో వినియోగించినప్పుడు తడి పెట్టినా, వర్షం కురిసినా నీటిని గ్రహించి పంటకు నీటి ఎద్దడి రాకుండా చూస్తుందన్నారు. నీటిని పీల్చుకుని వర్షాభావ పరిస్థితుల్లో పంట వేళ్లకు నీరు అందిస్తూ వాడిపోకుండా 15 రోజులు కాపాడుతుందన్నారు. అలాగే వేరుశనగలో పంట దిగుబడి పెంచుకోవడానికి ఎకరాకు 100 కిలోల సూపర్ ఫాస్పేట్, 200 కిలోల జిప్సం ఎరువు వేయాలని సూచించారు. వేరుశనగ సాగులో పెరుగుతున్న కూలీల ఖర్చు తగ్గించుకోవడానికి గొప్పు తీసేటప్పుడు కలుపు మందులు అలవాటు చేసుకోవాలన్నారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులకు పూసాజెల్‌ను మండల వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

కార్యక్రమంలో వ్యవసాయశాఖ భీమిలి సహాయ సంచాలకుడు బి.విజయప్రసాద్, జిల్లా శిక్షణా కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్ సురేష్, భీమిలి ఏవో బి.శివకోమలి, ఉప సర్పంచ్ బి.అప్పన్న, ఏఎబీ చైర్మన్ కేవీ రమణ, వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు బి.రమేష్, ఎల్.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మధురవాడ: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యం అయ్యింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ సమీపంలోని రేవళ్లపాలెం పద్మపూజిత అపార్ట్‌మెంట్‌లో పొన్నాడ శ్రీనివాసరావు భార్య, పిల్లలతో నివసిస్తున్నారు. భార్య పొన్నాడ వరలక్ష్మి (32) గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా నివసించే ఓ యువకుడు తీసుకుని వెళ్లిపోయినట్లు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గీతం లా స్కూల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ద్వారా 2023 – 24 విద్యా సంవత్సరంలో న్యాయ విద్యను అభ్యసించడానికి ప్రవేశాలు పొందిన నూతన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు బుధవారం న్యాయ నిపుణుల సమక్షంలో ప్రారంభించారు. దామోదర సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయ విశిష్ట ప్రొఫెసర్ ఎ.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ న్యాయ విద్యను అభ్యసించిన ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడానికి అధ్యాపకులతో ముఖాముఖి చర్చలతోపాటు వివిధ జర్నల్స్ పరిశీలించడం, స్వయంగా నోట్సు తయారు చేసుకోవడం అవసరమని సూచించారు. కార్యక్రమంలో విశాఖ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వి.రవీంద్ర ప్రసాద్, గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యునికి సరకులు అందజేత

తగరపువలస: చూపు మందగించి, వృద్ధాప్యం పైబడటంతో మంచానికే పరిమితమైన జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొత్తపేట నివాసి యర్రా సన్యాసిరావుకు వాస్తవ సేవా సంఘం ప్రతినిధులు బుధవారం బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. వీటిని గాయిత్రి జెరాక్స్ యజమాని దేశెట్టి లీలావతి సమకూర్చినట్టు సంఘం అధ్యక్షుడు పిట్టా సురేష్ తెలిపారు. సంఘం వలంటీర్లు భీమవరపు ప్రకాష్, కందివలస దుర్గారావు, పిల్లా రాజేష్, పిట్టా రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీరుపేటలో దొడ్ల పండగ

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీ జీరుపేటలో పాడిరైతులు బుధవారం దొడ్ల పండగ ఘనంగా జరుపుకున్నారు. ఏటా కర్కాటక రాశిలో బంగారుతల్లి, దేశమ్మ అమ్మవార్లకు జరిపే పండగలో పశువులను కూడా పూజిస్తారు. పిల్లా పాపలు, పశుపక్ష్యాదులు కలకాలం సుఖ సంతోషాలతో ఉండటానికి గ్రామస్తులు పూర్వం నుంచి ఈ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మేకలు, గొర్రెలు, కోళ్లు సమర్పించుకుంటారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకులు, వేద పండితులు అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గీతంను సందర్శించిన మలేషియా వర్సిటీ బృందం

కొమ్మాది: మలేషియాలో గల మైనాష్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. మైనాష్ విశ్వవిద్యాలయం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ మాద్యు నికోల్‌సన్, ఇంపాక్ట్ స్కూల్ అధిపతి డా. వి.వి.మోహన్‌తో కూడిన బృందం ఇక్కడ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్, మూర్తి రీసెర్చ్ ల్యాబ్స్, తదితర విభాగాలను సందర్శించారు. అనంతరం గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్, వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, వివిధ విభాగాల డీన్‌లతో సమావేశం నిర్వహించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

ఆనందపురం : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని గ్రేహౌండ్స్ ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి సూచించారు. మండలంలోని వెల్లంకిలో ఉన్న ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్గాలు తెలిసిన వారే సమాజానికి దిశా నిర్దేశం చేయగలరని, అలాంటి వారిని విద్యార్థి దశ నుంచే ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అల్లు భానుమతి, సీఈవో రఘురాజ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలిద్దాం



ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, మేయర్ హరివెంకట కుమారి

కొమ్మాది: వాతావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు నగర ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కోరారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో రూ. 11.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్‌ను వీరు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ తాము వాడిన ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు సీసాలు, పాత దుస్తులను ఈ సెంటర్లకు అందజేస్తే వాటిని రీసైక్లింగ్ చేస్తారన్నారు. ప్లాస్టిక్ వల్ల మానవాళికే కాకుండా జీవరాశులకు కూడా పెను ముప్పు వాటిల్లుతుందని, అందుకే ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఈ ప్రాంగణంలో టైర్లతో ఏర్పాటు చేసిన బెంచీలు, చిన్న పిల్లలు ఆడుకునే ఉయ్యాలను పరిశీలించారు. రాత్రి సమయాల్లో ఎండాడ ప్రాంతాల్లో మహిళలు ఒంటరిగా వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారని, మందుబాబులు, ఆకతాయిలు భయాందోళనకు గురి చేస్తున్నారని పలువురు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకుని రాగా... వెంటనే పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, స్థానిక నాయకులు అల్లాడ ఉమామహేశ్వరరావు, లొడగల రామ్మోహన్, నొడగల రాంబాబు, జి.వీరభద్రం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కోలా గురువులుకు ఘన సన్మానం



కోలా గురువులును సన్మానిస్తున్న నాయకులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్, మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కోలా గురువులును ఆయన స్వగ్రామమైన భీమిలి మండలం పెదనాగమయ్యపాలెంలో మత్స్యకార నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పట్ల నిబద్ధతతో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల నమ్మకంతో వెంట నడిచిన నాగమయ్యపాలెం ముద్దుబిడ్డ గురువులుకు సముచిత స్థానం లభించిందని కొనియాడారు. ఇది అందరి మత్స్యకారులకు లభించిన గౌరవమన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలకు లభిస్తున్న గుర్తింపు, గౌరవం మరే ఇతర పార్టీలో లభించవన్నారు. సీఎం జగన్ చెప్పిందే చేస్తారని... చేసిందే చెబుతారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మత్స్యకారులంతా వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు దూడ ధనంకొండ, బడే ఎల్లారావు, ఎం.ప్రసాద్, వి.దానయ్య, జి.అచ్యుతరావు, గరికిన పరశురాం, ఎస్.రాము, జి.అప్పయ్యతాత తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 2లో 87.62 శాతం పింఛన్ల పంపిణీ



మారికవలస ఆర్జీకే కాలనీలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 పరిధిలోని భీమిలి, విశాఖ తూర్పు నియోజకవర్గాల్లో గల 5 నుంచి 13వ వార్డు వరకు సోమ, మంగళవారాల్లో 87.62 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. పంపిణీ పనులను యూసీడీ ఏపీడీ గంగాధర్ పర్యవేక్షించారు. జోన్‌లో మొత్తంగా 19,371 మంది పింఛన్ల లబ్ధిదారులు ఉండగా 16,973 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్జీకే కాలనీలో 76వ నంబరు సచివాలయం పరిధిలో 107 బ్లాక్‌లో బి.మంగమ్మ అనే వృద్ధురాలికి వలంటీర్ భార్గవి, సచివాలయ కన్వీనర్ కల్లేపల్లి శంకరరావు, గృహ సారథులు సూర్యనారాయణ, మహేష్ పింఛన్ నగదు అందించారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'పై సర్వే



తాటితూరు చేరుకున్న ఆంధ్ర వైద్య కళాశాల సామాజిక సేవా విభాగం వైద్యులు

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ ప్రోగ్రాంపై ఆంధ్ర వైద్య కళాశాల సామాజిక సేవా విభాగం భీమిలి మండలం తాటితూరులో మూడు రోజుల పాటు సర్వేను బుధవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి రక్తపోటు, మధుమేహం, ఇతర ఆరోగ్య సమస్యలపై తనిఖీలు, అవగాహన చేపట్టనున్నారు. విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి, ప్రొఫెసర్ డాక్టర్ రాధాకుమారి, 25 మంది మెడికోలు, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, బి.శోభారాణి, సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, శిరిగుడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన చెక్‌డ్యామ్



సంగివలస - పాంద్రంగి రహదారిపై కుంగిన చెక్‌డ్యామ్‌పై మట్టిపోసిన దృశ్యం

తగరపువలస: సంగివలస – పాంద్రంగి రహదారిపై సంగివలస శివారు వద్ద గోస్తనీ నదిపై చెక్‌డ్యామ్ కుంగిపోయింది. 2014 హుద్‌హుద్ సమయంలో ఇక్కడ భారీ ఎత్తున నది కోతకు గురై పెద్ద గొయ్యి ఏర్పడింది. తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం హడావిడిగా నాణ్యత లేకుండా చెక్ డ్యామ్ నిర్మించింది. దీంతో ఏడాదైనా గడవక ముందే డ్యామ్ మధ్యలో రంధ్రం పడి కుంగిపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే లారీ కార్మికులు చెక్‌డ్యామ్‌పై ఏర్పడిన గోతిని డెబ్రిస్‌తో కప్పుకుంటూ వస్తున్నారు. ఆనందపురం, భీమిలి మండలంలో కురిసిన వర్షం నీరు వ్యవసాయ భూములు, గెడ్డల ద్వారా ప్రవహించి సంగివలస వద్ద గోస్తనీ నదిలో కలుస్తోంది. ప్రస్తుతం చెక్ డ్యామ్ కుంగిన కారణంగా కింద నుంచి నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడింది. నీటి ప్రవాహంతో వచ్చిన చెత్త దీని కింద ఇరుక్కుపోయింది. డ్యామ్ కింద పైపులు సరిచేసి నీటి ప్రవాహానికి అడ్డం లేకుండా చేయాలని సంగివలస వాసులు కోరుతున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యానికి రక్ష



మారికవలసలో గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్న నాయకులు



టి.నగరపాలెంలో ఆహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకట శివ సూర్యనారాయణరాజు



రేవళ్లపాలెంలో సరకులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: వైఎస్సార్ సంపూర్ణ ఆహారంతో బాలింతలు, గర్భిణులకు పూర్తి పోషకాలు అంది ఆరోగ్యకరంగా ఉంటారని ఎంపీపీ దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసురాజు) అన్నారు. భీమిలి మండలం టి.నగరపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఈ కిట్లను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ సంపూర్ణ ఆరోగ్యవంతులైన చిన్నారులపై ఆధారపడి ఉందన్నారు. దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం కోసం కనీస జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు, పొట్నూరు చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ పంపిణీ

కొమ్మాది: పిల్లలు, గర్భిణులకు సమతుల పోషకాహారం అందించడమే ధ్యేయంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పనిచేస్తోందని నాయకులు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస, కొమ్మాది, 8వ వార్డు రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో ఆయా ప్రాంత నాయకులు ఈ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బొట్టా అప్పలరాజు, లొడగల రామ్మోహన్, ముచ్చు రామారావు, జేఎస్ రెడ్డి, గుంటుబోయిన సంజీవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 పరిధిలో గల పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) పంపిణీని జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలో బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిన మూర్తిబాబు, రాయిన సాయికుమార్ సరకులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దేవి, నాయకులు రామకృష్ణ, అప్పలరాజు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

చదునుపట్టు నిర్మాణ పనులు ప్రారంభం

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న గ్రామ దేవత నూకాలమ్మ చదునుపట్టు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ అనేక సంవత్సరాలుగా అమ్మవారికి చిన్న మందిరం లాంటిది ఉంది. ఏటా అమ్మవారి ఉత్సవాల సమయంలో చదునుపట్టుగా పిలిచే ఇక్కడకు నూకాలమ్మ గరగను ఊరేగింపుగా తీసుకొచ్చి కొద్ది రోజులు ఉంచుతారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అయితే పరిసర ప్రాంతాలు బాగా దెబ్బతినడంతో ఇబ్బందిగా ఉంది. ఈ కారణంతో పలువురు పెద్దలు కొత్త చదునుపట్టు నిర్మించాలని భావించారు. అందులో భాగంగా ఇప్పుడు నిర్మాణ పనులు చేపట్టారు.

అవకాశాలు వినియోగించుకోండి



సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ విజయకృష్ణన్

కొమ్మాది: ప్రభుత్వం కల్పిస్తున్న చక్కటి సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకుని ఉన్నత స్థానంలో నిలవాలని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. రుషికొండలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ముందుగా ఇక్కడ సివిల్ సర్వీసెస్ ఉచిత రెసిడెన్సియల్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి, వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం స్టడీ సర్కిల్ భవన్ సముదాయంలోని విద్యార్థుల సెమినార్ హాల్స్, లైబ్రరీ, స్టడీ రూమ్స్, వసతి గదులు, హాస్టల్‌లో కిచెన్‌ను పరిశీలించారు. ఇక్కడ మరమ్మతులు చేయాల్సి ఉన్నందున నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు డి.శ్రీనివాస్, ఉప సంచాలకులు కె.రామారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రతీ నెలా వసతి గృహాలను సందర్శిస్తా'



వసతి గృహాల వార్డెన్లతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: నియోజకవర్గంలోని వసతి గృహాలను నెలలో ఒకసారి సందర్శించనున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని వసతిగృహాల వార్డెన్లతో భీమిలిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతిగృహాల పనితీరు, వసతులు, మౌలిక సదుపాయాలు, భోజనాలు, మిగిలిన సీట్ల భర్తీపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం జాగ్రత్తగా చూడడంతోపాటు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో వార్డెన్లు రమాదేవి, అరుణ, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుధాకరరెడ్డి సేవలు మరువలేనివి



సుధాకర రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

భీమునిపట్నం: భీమిలిలో డాక్టర్ దాదిరెడ్డి సుధాకర రెడ్డి సంస్మరణ సభ ఆయన కుమారుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ డి.శైలేంద్రరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని సుధాకరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 45 సంవత్సరాలుగా వైద్యునిగా సుధాకరరెడ్డి అందించిన సేవలు మరువలేనివన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అదేవిధంగా డాక్టర్ సుధాకరరెడ్డి టెన్నిస్ క్రీడాకారుడు కూడా కావడంతో భీమిలి టెన్నిస్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు మైలిపల్లి షణ్ముఖరావు, వెంకటేష్, భీమారావు, విజయభాస్కర్ నివాళులర్పించారు.



కొల్లి పార్వతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: ఇటీవల మరణించిన భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీ సర్పంచ్ కొల్లి పార్వతి కుటుంబాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె తనయుడు కోటిరెడ్డితో మాట్లాడుతూ ధైర్యం చెప్పారు. పార్టీతోపాటు తాను ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, విశ్రాంత వీఆర్వో కొయ్య అప్పల సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల ఏఈఈ సురేష్ కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, బంటుబిల్లి వారి కళ్లాలు, పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, జగన్నాథపురం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి తమతో సహకరించాలని ఏఈఈ సురేష్ కుమార్ కోరారు.

తగరపువలస: చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రూరల్ ఏఈఈ జరజాపు రాము తెలిపారు. 11 కేవీ బోడమెట్టపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ, చెట్ల నరికివేత కారణంగా బోడమెట్టపాలెం, రామునాయుడుపేట, ముద్దాడపేట, అల్లుపేట, రెల్లిపేట, దాకమర్రి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.